ప్రజాశక్తి
శుక్రవారం 28 నవంబర్ 2025 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

వెంటాడుతున్న తుపాన్లు

- మళ్లీ బంగాళాఖాతంలో మరో వాయుగుండం
- 30న భారీ వర్షాలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

తుపాన్లు ఆందోళన కలిగిస్తున్నాయి. మొన్న మొంథా తుఫాను మిగిల్చిన నష్టాల నుంచి కోలుకోకముందే మళ్లీ బంగాళాఖాతంలో మరో వాయుగుండం ఏర్పడింది. నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో తీవ్ర వాయుగుండం.. తుపానుగా మారిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ తుపానుకు 'దిత్వాహ్'గా యెమన్ దేశం నామకరణం చేసినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ఓడరేవుల్లో రెండో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ నెల 30న ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశముందని రెడ్ అలర్ట్ ప్రకటించారు. అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. మొంథా తుపాను వల్ల 12,600 హెక్టార్లలో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. రోడ్లు భారీగా దెబ్బతిన్నాయి. రోడ్ల మరమ్మతులకు రూ.300 కోట్లకు పైగానే అవసరమవుతాయని అంచనా వేశారు. గ్రామాల మధ్య రహదారులు నామరూపాల్లేకుండా పోయాయి. మున్సిపల్ పట్టణాల్లోనూ భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి. ముంపు సమస్య మళ్లీ ముందుకొచ్చింది. తాత్కాలిక చర్యలు చేపట్టారు. శాశ్వత పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని ఇన్‌ఛార్జి మంత్రి రామనారాయణ డిఆర్‌సిలో అధికారులను ఆదేశించారు. తర్వాత ఎమ్మెల్యేలు సిఎం చంద్రబాబును కలుస్తూనే ఉన్నారు. నిధులు ఇవ్వాలని కోరుతున్నారు. తుపానులు వస్తే తప్ప వర్షాల జాడ ఉండటం లేదు. సకాలంలో వర్షాలు లేనందున పంటలపైనా ప్రభావం పడుతోంది. ప్రస్తుతం పొగనాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. శనగసాగు కూడా మొదలైంది. తుఫాను వల్ల రబీ సాగు కూడా సందిగ్ధంలో పడింది. ఇప్పుడు మళ్లీ తుఫాను వస్తే ఉన్న పైర్లకు నష్టం తప్పదని భావిస్తున్నారు. వ్యవసాయం మరింత దెబ్బతినే ప్రమాదం లేకపోలేదు. ఏదేమైనా తుపాన్లు ఆందోళన కలిగిస్తున్నాయి.

మార్కాపురం జిల్లాపై

ప్రిలిమినరీ నోటిఫికేషన్



- కొత్త జిల్లాలో కనిగిరి, మార్కాపురం రెవెన్యూ డివిజన్లు
- 'ప్రకాశం'లో అద్దంకి, ఒంగోలు, కందుకూరు డివిజన్లు
- అభిప్రాయ సేకరణకు అధికారులకు ఆదేశాలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మార్కాపురం జిల్లా ఏర్పాటు, కొత్త రెవెన్యూ డివిజన్లు, మార్పులు చేర్పులపై రాష్ట్ర ప్రభుత్వం గురువారం నాడు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేసింది. కొత్తగా చేపట్టిన ఈ మార్పులు-చేర్పులపై ప్రజల నుంచి అభిప్రాయాలు వస్తే వాటిని స్వీకరించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదికను సిఎం చంద్రబాబు ఆమోదించాక ఈ ప్రక్రియకు సంబంధించి చకచకా వ్యవహారాలు సాగుతున్నాయి. గురువారం నాడు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేశారు. నాలుగు నియోజకవర్గాలతో కొత్తగా ఏర్పాటు కాబోతోన్న మార్కాపురం జిల్లాలో మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లు ఉంటాయి. వీటి కింద మండలాలను నిర్ణయించారు. ప్రకాశం జిల్లాలో ▶ 2లో

ప్రకాశం జిల్లా మండలాలు

ఒంగోలు రెవెన్యూ డివిజన్
ఒంగోలు, కొత్తపట్నం, కొండపి, జరుగుమల్లి, శింగరాయకొండ, టంగుటూరు, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు

కందుకూరు రెవెన్యూ డివిజన్
కందుకూరు, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు, వలేటివారిపాలెం, మర్రిపూడి, పొన్నలూరు

అద్దంకి రెవెన్యూ డివిజన్
అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె.పంగులూరు, కోరిశపాడు ముండ్లమూరు, తాళ్లూరు, దర్శి, దొనకొండ, కురిచేడు

మార్కాపురం జిల్లా మండలాలు

మార్కాపురం రెవెన్యూ డివిజన్
మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి, యర్రగొండపాలెం, పెద్దారవీడు, త్రిపురాంతకం, దోర్నాల, పుల్లలచెరువు, గిద్దలూరు, కొమరోలు, రాచర్ల, అర్ధవీడు, కంభం, బేస్తవారిపేట.

కనిగిరి రెవెన్యూ డివిజన్:
కనిగిరి, పామూరు, పెద్దచెర్లోపల్లి, హనుమంతునిపాడు, వెలిగండ్ల, చంద్రశేఖరపురం.

'ఉత్తుత్తి' బ్యాంకుతో మోసం.!

- సుమారు రూ.3 కోట్ల వరకు డిపాజిట్లు
- 6 నెలల క్రితం బ్యాంకు మూసేసి పరారైన మోసగాడు..
- ఎట్టకేలకు నిందితుడిని పట్టుకున్న బాధితులు
- పోలీసులకు అప్పగింత




శ్రీ మణికంఠ క్రెడిట్ సొసైటీ ఆఫీస్

ప్రజాశక్తి- వేమూరు

ప్రజలకు అధిక వడ్డీ ఆశ పెట్టి.. ఓ మోసగాడు ఏకంగా బ్యాంకునే నెలకొల్పాడు. ఖాతాదారుల డిపాజిట్లపై కొంతకాలం పాటు ఎక్కువ వడ్డీని క్రమం తప్పకుండా ఇచ్చాడు. ఖాతాదారులు మరింత నమ్మకంతో సుమారు రూ.3 కోట్ల వరకు డిపాజిట్లు చేశారు. ఇదే అదునుగా భావించిన సదరు మోసగాడు ఆరు నెలల క్రితం బ్యాంకు మూసేసి.. ఆ మొత్తంతో పరారయ్యాడు. దీంతో బాధితులు పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేశారే తప్ప ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఎట్టకేలకు నిందితుడిని బాధితులు పట్టుకొని పోలీసులు అప్పగించారు. ఈ ఘటన వేమూరు మండలం, చావలిలో వెలుగు చూసింది.

బాధితుల కథనం ప్రకారం.. చావలి గ్రామంలో తెనాలికి చెందిన మణికంఠ జ్యుయలరీ షాప్ యజమాని కొల్లూరు ఉదయ వెంకటేశ్వరరావు గత కొన్నేళ్ల క్రితం శ్రీ మణికంఠ మ్యూచువల్ ఫ్లేటెడ్ కోపరేటివ్ అండ్ క్రెడిట్ సొసైటీ పేరుతో ప్రైవేటు బ్యాంకును ప్రారంభించాడు. తెనాలి, వేమూరు మండలాల పరిధిలోని ప్రజలు బంగారు వస్తువులను తాకట్టు పెట్టుకొని నగదు ఇవ్వడం, బంగారం కొనుగోలు చేయటం, బంగారు ఆభరణాలు తయారీ చేసి ఇస్తూ నమ్మకంగా ఉంటూ వచ్చాడు. బ్యాంకులో బంగారు వస్తువులు తాకట్టు పెట్టుకుంటూ ప్రభుత్వ బ్యాంకుల కంటే కూడా తక్కువ వడ్డీతో ఎక్కువ నగదు ఇచ్చేవాడు. బ్యాంకులో నగదు డిపాజిట్ చేస్తే అధిక వడ్డీ ఇచ్చేవాడు. నెలనెలా వడ్డీ ఇచ్చేవాడు. ఆరు సంవత్సరాల డిపాజిట్‌లపై రెట్టింపు సొమ్ము ఇచ్చేవాడు. ఈ వ్యాపారం కొన్నేళ్ల పాటు సజావుగానే సాగింది. దీంతో ఖాతాదారులు పెరిగారు. ప్రజలు అధిక వడ్డీలకు ఆశ పడి ▶ 2లో



NOT TRANSFERABLE ☎ : 228492
SRI MANIKANTA MUTUALLY AIDED CO-OPERATIVE THRIFT AND CREDIT SOCIETY LIMITED
Regd. No:AMC/GNT/DCO/2017/3585
TENALI - 522 201
No. CHV/FD/41 058 TERM DEPOSIT RECEIPT FD/41 Due on 02/02/2028 Date 02/02/2022
Rs. 150000/-
Received from Sri Kothamasu Sankara Rao
Rupees one lakh fifty thousand rupees only
as a Deposit repayable 72m Days / Months after date with
Interest at the rate of 12% Present per annum
Principal Rs. 150000
Interest Rs. 154919
Maturity Value Rs 304919/-
SRI MANIKANTA MUTUALLY AIDED CO-OP THRIFT AND CREDIT SOCIETY LIMITED
C.E.O CHAIRMAN
N.B :- Interest will cease on the expiry of the period for which deposit was made

ఓ ఖాతాదారు చేసిన డిపాజిట్‌కు బ్యాంకు సిబ్బంది ఇచ్చిన రశీదు

రూ.15 లక్షలు డిపాజిట్ చేశా..

కొత్తమాసు శంకరరావు, బాధితుడు



దాచు కున్న రూ.15 లక్షల సొమ్మును మణికంఠ కోపరేటివ్ స్టేట్ బ్యాంకులో డిపాజిట్ చేశా. ఆరేళ్ల కాలపరిమితికి గాను నాలుగేళ్లు పూర్తి అయ్యాయి. రెండేళ్లలో రెట్టింపు సొమ్ము వస్తుందని ఆశ పడుతున్న తరుణంలో నిందితుడు బ్యాంకు మూసేసి.. పరారయ్యాడు. ఏమి చేయాలో పాలుపోవడం లేదు.

60 గ్రాముల బంగారం ఇచ్చా..

మాన్యం కనకదుర్గ, బాధితురాలు, పెనమర్రు గ్రామం



నూతన బంగారు ఆభరణాల తయారీ కోసం ఆరు లక్షల విలువైన 60 గ్రాముల పాత బంగారాన్ని ఇచ్చా. మజూరీ కింద మరో రూ.20 వేలు చెల్లించా. బంగారం ఇచ్చిన పది రోజులలోనే నిందితుడు బ్యాంకును మూసేసి పారిపోయాడు. నిందితుడి నుంచి రికవరీ చేసి.. బంగారం ఇప్పించాలి.

మెప్మాలో అవినీతిపై

విచారణ ప్రారంభం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) కార్యాలయంలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలపై మెప్మా స్టేట్ మిషన్ కోఆర్డినేటర్స్ బృందం గురువారం విచారణ చేపట్టింది. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కేశస్వామి పేటకు చెందిన విఘ్నేశ్వర మహిళా సమాఖ్యకు చెందిన సభ్యులకు 2022 సంవత్సరంలో బ్యాంక్ మంజూరు చేసిన రుణాల్లో వారికి తెలియకుండా ఆర్‌పి. దివ్య శాంతి కొంత మొత్తం తీసుకున్నట్లు సంఘ సభ్యులు ఆరోపించారు. దీంతో మెప్మా పీడీ పి.శ్రీహరి ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేసి నివేదికను రాష్ట్ర కార్యాలయానికి పంపారు. దీంతో స్టేట్ మిషన్ కోఆర్డినేటర్స్ ఎస్.ఆదినారాయణ, ప్రభావతి ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల బృందం గురువారం ఒంగోలు చేరుకుంది. ఒంగోలు మెప్మా కార్యాలయంలో విఘ్నేశ్వర మహిళా సమాఖ్య ఆర్‌పి కె.దివ్య శాంతికి కేటాయించిన 36 సంఘాలకు గాను 8 ఎస్‌టి (యానాది) సంఘాల వారీగా, సభ్యులను విచారించారు. రుణం ఎప్పుడు తీసుకున్నారు, ఎంత మొత్తం తీసుకున్నారు. ఇప్పటి వరకు ఎంత మొత్తం చెల్లించారు, బ్యాంక్ ఖాతా వివరాలను ప్రతి సంఘ సభ్యురాలివద్ద నుంచి రాతపూర్వకంగా, మౌఖిక వివరణలను కమిటీ సభ్యులు తీసుకున్నారు. సిపార్సు చేసిన సిఒ మాధవీలత, సిఎంఎం డిసిహెచ్.కొండయ్యను విచారించారు. కొన్ని సంఘాల సభ్యులు పనుల కోసం బయటకు వెళ్లటంతో వారి విచారణ పూర్తి కాలేదు. విఘ్నేశ్వర మహిళా సమాఖ్య పరిధిలోని సంఘాలకు టిఇ(బ్యాంక్ లింకేజీ), టిఇ(ఐబి), ఒంగోలు సిఎంఎం ఆధ్వర్యంలో ప్రతి 3 సంఘాలకు ఒక్కో సిఒను నియమించి, సంఘ సభ్యుల ఇళ్ళకు వెళ్ళి వివరాలు సేకరించాలని ఆదేశించారు. 2022 లో విఘ్నేశ్వర మహిళా సమాఖ్య, సంఘ సభ్యులు తీసుకున్న బ్యాంకు రుణాల మొత్తం రుణాలు తీసుకున్న తేదీలు, బ్యాంక్ ఖాతా వివరాలు, వ్యక్తిగత ఖాతా వివరాలు వంటివి. రుణాల సమయంలో జరిగిన ఇతర లావాదేవీలు, పరిస్థితులు పేకరించిన సమాచారం ఆధారంగా రూపొందించాల్సిన నివేదికను 4 రోజుల్లోపు కార్యాలయానికి సమర్పించాల్సిందిగా ఆదేశించారు. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని సంఘాలలో బోగస్ ఋణాలకు ▶ 2లో

మార్కాపురం జిల్లాపై

ప్రిలిమినరీ నోటిఫికేషన్

(మొదటిపేజీ తరువాయి)

అద్దంకి, ఒంగోలు, కందుకూరు రెవెన్యూ డివిజన్లు ఉంటాయి. వీటి కింద మండలాలను పాలనాసౌలభ్యం బట్టి నిర్ణయించారు. వీటిపై ఎవరైనా అభ్యంతరాలను కలెక్టర్ కార్యాలయానికి పంపించాల్సి ఉంది. ఇదిలా ఉండగా శుక్రవారం నాడు జరిగే మంత్రివర్గ సమావేశంలోనూ కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లకు ఆమోదం తెలనున్నారు.

మండలాల మార్పులపై జీవో

మార్కాపురం జిల్లా పలు మండలాలను మార్పులు చేర్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో పొదిలి, కొనకనమిట్ల మండలాలు ఇప్పటివరకు కనిగిరి డివిజన్లో ఉన్నాయి. ప్రస్తుతం ఉత్తర్వుల ప్రకారం ఆ రెండు మండలాలను మార్కాపురం సబ్ డివిజన్లో కలుపుతూ ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. భౌగోళికంగా మార్కాపురం నియోజకవర్గంలో ఆ రెండు మండలాలు ఉన్నందున ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించి అన్ని శాఖలకు జీవో జారీ చేశారు. మొదటగా గిద్దలూరు నియోజకవర్గం ఉండేలా నిర్ణయం తీసుకున్నారు. అక్కడి ప్రజల అభీష్టం మేరకు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. గిద్దలూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలు మార్కాపురం రెవెన్యూ డివిజన్లో కొనసాగాలని మరోసారి నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. కనిగిరి రెవెన్యూ డివిజన్‌లో ఆ నియోజకవర్గ పరిధిలోని మండలాలు మాత్రమే ఉంటాయి. మార్కాపురం రెవెన్యూ డివిజన్లో 15 మండలాలు, కనిగిరి రెవెన్యూ డివిజన్లో ఆరు మండలాలు కొనసాగుతున్నాయి.

'ఉత్తుత్తి' బ్యాంకుతో మోసం.!

(మొదటిపేజీ తరువాయి)

ఈ బ్యాంకు పట్ల మక్కువ చూపారు. ఈ బ్యాంకులో సుమారు 194 మంది ఖాతాలు ప్రారంభించారు. కొంత మంది వ్యాపారులు, రైతులు పొలాలను అమ్ముకొని లక్షలాది రూపాయల నగదును ఈ బ్యాంకులో డిపాజిట్ చేశారు. డిపాజిట్ చేసిన సొమ్ము మరియు ఆర్‌డిల ద్వారా వచ్చిన సొమ్ము సుమారు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఉంటుంది. ఈ క్రమంలో కోట్లాది రూపాయల బంగారం, డిపాజిట్ల ద్వారా నగదును సేకరించిన ఉదయ్ వెంకటేశ్వరరావు ఆరు నెలల క్రితం బ్యాంకు మూసేసి పరారయ్యాడు. దీంతో బాధితులు పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేశారే తప్ప ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఈ క్రమంలో ఉదయ్ వెంకటేశ్వరరావు ఓ వ్యక్తి నుంచి రావాల్సిన రూ.25 లక్షల కోసం గతంలో కోర్టులో వ్యాజ్యం వేశాడు. కోర్టు వెంకటేశ్వరరావుకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ విషయం గురించి న్యాయవాది వెంకటేశ్వరరావుకు ఆయన తమ్ముడి ద్వారా సమాచారం అందించాడు. దీంతో ఆయన నగదు తీసుకొనేందుకు తెనాలికి వచ్చాయి. అప్పటికే కాపు కాసి ఉన్న బాధితులు ఉదయ వెంకటేశ్వరరావును పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వేమూరు పోలీసులు వెంకటేశ్వరరావు, అతని తమ్ముడిని అదుపులోకి తీసుకొని విచారించారు. బంగారాన్ని తెనాలిలోని మరో ఐదు దుకాణాలలో తాకట్టు పెట్టినట్లు తెలిపారు. నిందితుడిని పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

రికవరీపై బాధితుల అనుమానాలు..

నిందితుడి వద్ద నుంచి పోలీసులు ఎంత మొత్తంలో రికవరీ చేశారు అనే విషయంపై బాధితులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిందితుల వద్ద నుంచి రికవరీ చేసిన బంగారం కేజీల కొద్దీ ఉంటుందని, మరి పోలీసులు కోర్డుకు ఎంత బంగారాన్ని చూపిస్తారోనని, తమకు ఏ మేరకు న్యాయం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ బంగారం, నగదు తమకు అప్పగించకపోతే చావే శరణ్యమని బాధితులు వాపోతున్నారు.

ఐదు రోజుల కస్టడీకి తీసుకున్నాం..

ఈ విషయంపై వేమూరు సిఐ పసుపులేటి వీరాంజనేయులు వివరణ కోరగా నిందితుడిని విచారించేందుకు కోర్టు నుంచి ఐదు రోజుల కస్టడీకి తీసుకున్నామన్నారు. నిందితుడిని పూర్తి స్థాయిలో విచారించి.. తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మెప్మాలో అవినీతిపై విచారణ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన డేటాను బ్యాంక్, బ్రాంచ్ వారిగా అన్ని బ్యాంకుల నుంచి సేకరించేందుకు 7 మందితో కమిటీ ని నియమించినట్లు తెలిపారు. అన్ని బ్యాంకుల డేటాను సేకరించనున్నట్లు తెలిపారు. వచ్చిన డేటాను ఆన్ లైన్ చేసిన సంఘాల డేటాతో పరిశీలించి, ఆన్ లైన్లో లేని గ్రూపుల డేటాను అందులో ఋణం తీసుకున్న సభ్యులను విచారించి వారి నుంచి వివరణ సేకరించనున్నట్లు తెలిపారు.

శానిటేషన్ పరిశీలన

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు గ్రామంలో జరుగుతున్న డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్, శానిటేషన్ ప్రక్రియను ఎంపీడీవో డి సురేష్ బాబు గురువారం పరిశీలించారు. ఇళ్ల పరిస రాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ముఖ్యం గా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఎంపీడీవో సురేష్‌బాబు సూచించారు. గ్రామం లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఎన్ ప్రతాప్ కుమార్‌ను ఎంపీడీవో సురేష్‌బాబు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎన్ ప్రతాప్ కుమార్, పంచాయతీ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ వై మణి, గ్రామ పంచాయతీ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఆదాంకు సిపిఎం ఘన నివాళి

ప్రజాశక్తి-కొండపి : సిపిఎం సీనియర్ సభ్యురాలు, మహిళా వ్యవసాయ కార్మిక ఉద్యమాల్లో సుదీర్ఘకాలం పాటు పనిచేసిన అంగలకుర్తి ఆదాం మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు అన్నారు. గురువారం ఆమె ఇంటివద్ద జరిగిన సంస్మరణ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఎం మండల కార్యదర్శి మల్లెల కొండయ్య అధ్యక్షత వహించారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, జి.వి.కొండారెడ్డి, సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య మాట్లాడుతూ కామ్రేడ్ ఆదాం మూడు దశాబ్దాలకు పైగా సిపిఎం సభ్యురాలుగా ఉన్నారని తెలిపారు. గ్రామంలో జరిగిన వ్యవసాయ కార్మికుల కూలీ పోరాటాలు, భూ ఉద్యమాల్లోనూ, మద్యపాన నిషేధం కోసం, మహిళల సమస్యల పరిష్కారం కోసం జరిగిన అనేక ఉద్యమాల్లో ఆమె పాల్గొన్నారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న దళితవాడ 45 ఏళ్ల క్రితం ముసి ఒడ్డున ఉండేదని, ఏరు పొంగినప్పుడు పేదలు తీవ్ర ఇబ్బందులు పడేవారని అన్నారు. సిపిఎం చొరవతో ఈ భూమి పోరాడి సాధించుకున్నామని తెలిపారు. ఈ భూమిలోకి పేదలను రానీయకుండా పెత్తందార్లు అడ్డుకున్నారని, వారి దౌర్జన్యాలను పేదలు ఐక్యంగా ఎదురుకున్నారని తెలిపారు. అలాంటి అనేక ఉద్యమాలలో ఆదాయం ముందు ఉన్నారని తెలిపారు. మాజీ సర్పంచ్ సిపిఎం నాయకులు గంటెనపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్థానికంగా జరిగిన అన్ని కార్యక్రమాల్లో ఆదం పాత్ర ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.రఘురాం, వి.బాలకోటయ్య, కేజీ మస్తాన్, నాయకు వి.మోజెస్, వినోద్, సీనియర్ నాయకులు అంగలకుర్తి బ్రహ్మయ్య, మల్లెల రమేష్, యం.చిన్న పేతురు, ఎల్ దావీదు, నిర్మల, సంపూర్ణ, పెద్ద పేతురు, సింగమ్మ, ముప్పరాజు బ్రహ్మయ్య, అంగాలకుర్తి సూరి, విశ్రాంత, పరిశుద్ధం తదితరులు పాల్గొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్కె మాబు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని నివాళులర్పించారు.



చెక్కు అందజేస్తున్న మంత్రి స్వామి

సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-టంగుటూరు

పేద ప్రజలకు ఆర్థికంగా, అండగా ఉండాలన్న ఉద్దేశ్యంతో వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయడం జరుగుచున్నదని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. టంగుటూరు మండలం, తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో 106 మంది లబ్ధిదారులకు రూ.55.08 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి స్వామి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, సంతోషంగా ఉండాలని, ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కారుమంచి టిడిపి సీనియరు నాయకులు ఈదర ప్రభాకరరావు, టంగుటూరు మండల టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పిడుగురాళ్ళ సురేష్, కామేపల్లి మాజీ సర్పంచి ఏలూరి రాంబాబు, ఆలకూరపాడు టిడిపి నాయకులు నార్ని మోహనరావు పలువురు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో వైద్యుల నిర్లక్ష్యం

చేయి విరిగినా ఎక్స్‌రే తీయని సిబ్బంది

ప్రజాశక్తి-కొండపి

మండలంలోని అనకర్లపూడి గ్రామానికి చెందిన యువకుడు మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు చేతి నొప్పితో వైద్యశాలకు వెళ్లి ఎక్స్రే తీయమనగా దానికి ఎక్స్రే అవసరం లేదని, అయిట్మెంట్ పూసుకుంటే తగ్గిపోతుందని అక్కడ ఉన్న సిబ్బంది సమాధానమిచ్చారు. రెండు రోజులుగా నొప్పితో అల్లాడుతూ గురువారం మరలా వైద్యశాలకు వెళ్లడంతో వైద్యురాలు కూడా ఈ చిన్న దానికి ఎక్సరే అవసరం లేదని, ఆయింట్మెంట్ రాసుకుంటే సరిపోతుందని సమాధానమిచ్చారు. నొప్పి తీవ్ర ఎక్కువగా ఉండటంతో మరలా వైద్యుల దగ్గరికి వెళ్లి గట్టిగా అడగడంతో అప్పుడు ఎక్స్‌రేకు ఓపిని పంపించారు. ఎక్స్రే రిపోర్టులో చేయి విరిగినట్టు వచ్చింది. రెండు రోజులపాటు యువకుడు తీవ్ర నొప్పితో ఇబ్బంది పడిపోయినా వైద్యులు పట్టించుకోలేదని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వ



కొండపిలో ప్రభుత్వ వైద్యశాల

వైద్యశాలలో కార్పొరేట్ తరహాలో వైద్యాన్ని అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు తీరా క్షేత్రస్థాయిలో ఎక్స్రే తీయడానికి కూడా రోజులు తిప్పించుకుంటున్నారని ప్రజలు మండిపడుతున్నారు. వైద్యశాలలోని వైద్యులు తాము సొంతంగా నిర్వహించుకుంటున్న క్లినిక్‌లపై ఉన్న శ్రద్ధ మండలంలోని పలు ప్రాంతాలనుంచి వచ్చే పేదలకు వైద్యం అందించేందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

బైక్ దొంగల ముఠా అరెస్ట్

ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

22 ద్విచక్రవాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో వరుసగా చోటు చేసుకున్న ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులను బాపట్ల జిల్లా సిసిఎస్ పోలీసులు, అమృతలూరు పోలీసులు సంయుక్తంగా చేధించారు. జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. జిల్లాలో వరుసగా చోటు చేసుకుంటున్న ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులను జిల్లా ఎస్పీ బి. ఉమా మహేశ్వర్ సవాలుగా తీసుకొని బాపట్ల సిసిఎస్ డిఎస్పి పి.జగదీష్ నాయక్ ఆధ్వర్యంలో సిసిఎస్ సిఐ ప్రేమయ్య, అమతలూరు ఎస్సై రవితేజలు వారి సిబ్బందితో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని, సీసీ కెమెరాల సమాచారం ఆధారంగా వినుకొండ ప్రాంతానికి చెందిన కొమ్మ వెంకట సాయి, కొమ్మ సాయి కృష్ణ, సంపంగళి నాని, సయ్యద్ నాగూర్ వలి, పందుల రమేష్ బాబు, పొదిలి మండలం, రామాపురంకు చెందిన బండి శివారెడ్డిలను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ 16.5 లక్షల విలువైన 22 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీరు రెండు సంవత్సరాల నుంచి చెడు వ్యసనాలకు అలవాటు పడి విలాసాలకు బైకులు దొంగతనం చేస్తున్నారు. ఇంటి



మాట్లాడుతున్న ఎస్పీ ఉమా మహేశ్వర్

ముందర పార్కింగ్ చేసి ఉన్న బైక్‌లను, రైతులు పొలం పనులకు వెళ్తూ పొలం గట్లు మీద పెట్టిన బైక్‌లను దొంగ తాళాలతో లాక్ ఓపెన్ చేసి దొంగిలించేవారు. ఈ బైక్‌లను వేరే జిల్లాలకు తీసుకు వెళ్ళి అక్కడ బైక్ మెకానిక్ షాపులలో అమ్ముతున్నారు. ముద్దాయిల మీద అంతకుముందు అనేక జిల్లాలలో కూడా కేసులు ఉన్నట్లు జిల్లా ఎస్పి తెలిపారు. ఈ కేసులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిసిఎస్ డిఎస్పి పి.జగదీష్ నాయక్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ ప్రేమయ్య, సిసిఎస్ ఎస్ఐలు రవి ప్రకాష్, రాంబాబు, కానిస్టేబుల్స్ కోటేశ్వర రెడ్డి, క్రిష్ణ, సురేష్, దాసు, చిరంజీవి, హెూంగార్డ్ రవూఫ్, అమర్తలూరు ఎస్సై కె.రవితేజ, ఏఎస్ఐ పి.సత్యనారాయణమూర్తి, కానిస్టేబుల్ పి.అనిల్ కుమార్, హోంగార్డు టి.రాజేష్‌లను జిల్లా ఎస్పీ బి.ఉమా మహేశ్వర్ అభినందించి నగదు రివార్డులను అందజేశారు. సమావేశంలో సిసిఎస్ డిఎస్పి జగదీష్ నాయక్, రేపల్లె డి.ఎస్.పి శ్రీనివాసరావు, సిసిఎస్ సిఐ ప్రేమయ్య, చుండూరు సిఐ పాల్గొన్నారు.

సీపీఎంతోనే పేదరికం నుంచి విముక్తి

కామ్రేడ్ ముప్పరాజు శేషయ్యకు నాయకుల నివాళి

ప్రజాశక్తి-కొండపి : పేదరికం నుంచి విముక్తి పొందాలంటే అది సీపీఎం ద్వారా మాత్రమే సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య తెలిపారు. గురువారం కామ్రేడ్ ముప్పరాజు శేషయ్య 26వ వర్ధంతి సందర్భంగా పెరిదేపి గ్రామంలో సభ జరిగింది. ఈ సభకు సిపిఎం మండల కార్యదర్శి మల్లెల కొండయ్య అధ్యక్షులుగా వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ ముప్పరాజు కోటయ్య మాట్లాడుతూ కామ్రేడ్ శేషయ్య పేదల పెన్నిధి అన్నారు. ఒక ఆశాకిరణం, శ్రమ జీవుల రాజ్యం రావాలని, అహర్నిశలు, కృషి చేసిన గొప్ప నేత మరణించి నేటికి 25 సంవత్సరాలు అయిందని అన్నారు. అంతిమయాత్రలో వందలాదిమంది పాల్గొని కడసారి నివాళులర్పించిన, ఘనత కామ్రేడ్ ముప్పరాజు శేషయ్యకు దక్కిందన్నారు. పేద రైతు కుటుంబం నుంచి వచ్చిన శేషయ్య భుక్తి కోసం నిరుపేదల విముక్తి కోసం కృషి చేశారన్నారు. కమ్యూనిస్టు పార్టీలో చేరి అనంతరం 1964లో సిపిఎం విధానమే సరైనది అని నమ్మిన వ్యక్తి ముప్పరాజు శేషయ్య అన్నారు. సీపీఎంలో చేరి కడవరకు పార్టీ అభివృద్ధికి కష్టజీవుల దళితుల అభివృద్ధికి పాటుపడిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ శేషయ్య అన్నారు. కమ్యూనిస్టులు ప్రజలలో ఉంటేనే మనుగడ సాధ్యపడుతుందన్నారు. 26వ వర్ధంతి సందర్భంగా ఆయన ఆశయ సాధనకు కృషి చేయ



మాట్లాడుతున్న ముప్పరాజు శేషయ్య

డమే ఆయనకు మనం ఇచ్చే నివాళి అన్నారు. సిపిఎం జిల్లా నాయకులు కేజీ మస్తాన్ మాట్లాడుతూ శేషయ్య అంటరానితనానికి వ్యతిరేకంగా, కులం మతం పోవాలని పోరాడాడన్నారు. ముప్పరాజు శేషయ్య చిత్రపటానికి అంగలకుర్తి చిన్న బ్రహ్మయ్య, అంగలకుర్తి జాంబులు పూలదండ వేశారు. ప్రజా నాట్యమండలి కళాకారులు పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య, అంగలకుర్తి సూరిబాబు, మల్లెల చిన్న పేతురు, ఆశీర్వాదం, అంగలకుర్తి విశ్రాంతి, లక్కిపోగు పరిశుద్ధం, లక్కిపోగు సుకన్య, లక్కిపోగు ఆనందరావు, లక్కిపోగు కేజియా, అంగలకుర్తి ప్రమీల, అంగలకుర్తి సుందర్రావు, అంగలకుర్తి అంజమ్మ, అంగలకుర్తి మాధవి, ఏ.కోటేశ్వరరావు మల్లెల బాబురావు, మల్లెల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-దర్శి : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన దర్శిలోని కురిచేడు రోడ్డులో జరిగింది. ఎన్ఎస్పి ఎన్ఎస్పి కాలువ బ్రిడ్జి కింద వ్యక్తి మృతదేహం ఉందని, దర్శి విఆర్ఓ మాదాసు మురళి ఇచ్చిన రిపోర్ట్ మేరకు దర్శి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని దర్శి ప్రభుత్వ ఆసుపత్రి శవాగారములో ఫ్రీజర్ బాక్స్‌లో ఉంచారు. మృతుడి వివరాలు తెలిస్తే దర్శి పోలీసులను సంప్రదించాలని ఎఎస్ఐ రాంబాబు తెలిపారు.

కీచక అధ్యాపకుడిపై విచారణ

ప్రజాశక్తి నాగులుప్పలపాడు

నిడమానూరు హైస్కూల్‌లో బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన అధ్యాపకుడిపై కలెక్టర్ రాజాబాబు, డీఈవో కిరణ్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం డిప్యూటి డీఈవో చంద్ర మౌలేశ్వరరావు, జిసిడిఓ హేమలత విచారణ చేపట్టారు. విద్యార్థినులను అడిగి పలు విషయాలను తెలుసుకున్నారు. ఆ సమాచార నివేదిను పైఅధికారులకు అందచేస్తామన్నారు. తదు పరి చర్యలకు వారి ఆదేశాల మేరకు తీసుకోవడం జరుగు తుందని తెలిపారు. కాగా అధ్యాపకుడిపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రజియా సల్తానా తెలిపారు.

కరెంటు షాక్‌తో మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ: కరెంటు షాక్‌తో మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన శింగరాయకొండ మండలం పాకల పరిధిలోని చెల్లెమ్మ గారి పట్టపూపాలెంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మత్స్యకారుడు కాటంగారి జలయ్య(30) విద్యుత్ స్తంభం వద్ద తీగలు సరిచేస్తుండగా షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతనికి ముగ్గురు పిల్లలతో పాటు భార్య ఉంది. మృతి చెందిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతదేహం వద్ద బోరున విలపిస్తున్నారు. ఎస్సై బి.మహేంద్ర మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

కృషి విజ్ఞాన కేంద్రం సందర్శన

ప్రజాశక్తి-దర్శి : దర్శిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ పరిశోధన సంచలకులు డాక్టర్ ఎన్‌వివిఎస్.దుర్గా ప్రసాద్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కృషి విజ్ఞాన కేంద్రంలోని వివిధ ప్రదర్శన క్షేత్రాలను పరిశీలించారు. అదేవిధంగా మెంథాతుఫాన్ ప్రభావం జిల్లాలోని వ్యవసాయ మరియు ఉద్యానవన పంటలపై ఎలాంటి ప్రభావం చూపిందో కెవికె, కార్యక్రమ సమన్వయ డాక్టర్ జి.రమేష్ వివరించారు. శాస్త్రవేత్తలు రైతులకు అందుబాటులో రైతులకు అన్నీ రకాల పంటలలో ఉత్పన్నమౌతున్న తీడపీడల సమస్య నుంచి గట్టెక్కించే భాద్యత విస్తరణ శాస్త్రవేత్తలదేనని గుర్తుచేశారు. వ్యవసాయం ఒక్కటే కాకుండా వ్యవసాయ అనుబంధ రంగాలపై రైతులకు అవగాహన కార్యక్రమాలను, చిరు వ్యాపారులుగా మార్చేందుకు అవసరమైన వృత్తి విద్య మరియు నైపుణ్య శిక్షణా కార్యక్రామాలను నిర్వహించాలన్నారు. అనంతరం కెవికెలోని వివిధ రకాల రికార్డులను తనిఖీ చేశారు.



మాట్లాడుతున్న సిఐ అజయ్‌కుమార్

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల : గంజాయితో వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నట్లు ఎర్రగొండపాలెం సిఐ అజయ్ కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం నాడు ఆయన మాట్లాడుతూ గంజాయితో ఉన్నట్లు ఎస్ఐ వి మహేష్‌కు సమాచారం వచ్చిందన్నారు. ఆయన తన సిబ్బందితో బోడేనాయక్ తండా వైపు వెళ్తుండగా పోలీస్ సిబ్బంది రాకను చూసి ముగ్గురు వ్యక్తులు పారిపోతుండగా ఎస్ఐ మహేష్ సిబ్బందితో కలిసి వారిని అదుపులోకి తీసుకున్నారు. పుచ్చకాయల శీను, అడపాల లాలా శీను, చల్లా సురేష్‌లను అదుపులోకి తీసుకొని, వారి నుంచి కేజిన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయి అరకు నుంచి తెప్పించి సున్నిపెంట, శ్రీశైలం ప్రాంతాలలో సాధువులకు, వ్యసనాలకు బానిసయిన వారికి అమ్మి డబ్బు సంపాదిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా గంజాయితో పాటు నిషేధిత వస్తువులు అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ప్రజాశక్తి జిఎం ఎంఎల్‌వి ప్రసాదరావు

సీనియర్ జర్నలిస్టు సువర్ణరాజుకు పితృవియోగం

ప్రజాశక్తి - బల్లికురవ

ప్రజాశక్తి సీనియర్ జర్నలిస్టు అత్తోట సువర్ణరాజు తండ్రి అత్తోట దాసు(82) మండలంలోని సుజాత నగర్ కాలనీలోని ఆయన స్వగృహం నందు వయోభారంతో మృతి చెందారు. దాసుకు భార్య విజయమ్మ, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు సువర్ణరాజు సీనియర్ జర్నలిస్టుగా ప్రజాశక్తిలో వివిధ బాధ్యతలు నిర్వహించారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎంఎల్‌వి ప్రసాదరావు దాసు మృతదేహానికి పూలమాల వేసి.. నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వేమూరు మండలం చదలవాడకు చెందిన తమ కుటుంబం 1969లో వ్యవసాయం నిమిత్తం ఎస్‌ఎల్ గుడిపాడు వచ్చామని, ఐదుగురు సంతానాన్ని పెంచి పోషించడం, అందరికీ విద్యా బుద్దులు నేర్పించడంలో తమ తల్లిదండ్రులు పడిన కష్టాన్ని సువర్ణరాజు గుర్తు చేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో ప్రజాశక్తి డెస్క్‌ఇన్‌ఛార్జి తారకరామారావు, సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి ఎ.బ్రహ్మయ్య, డివిజన్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్, సురేష్ ఉన్నారు.



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అనగాని శివప్రసాద్

అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరులు శివప్రసాద్ గురువారం భూమి పూజ చేశారు. నడింపల్లి నుండి గోవాడ వెళ్లే బిటి రోడ్డు ఉపాధి హామీ నిధులు రూ.1.80 కోట్లతో నిర్మాణానికి భూమి పూజ చేశారు. చెరుకుపల్లి సంత బజార్ రోడ్ హైవే నుంచి శ్రీ బాల కోటేశ్వరస్వామి గుడి వరకు డిఎంఎఫ్ నిధులు రూ.కోటితో సిసి రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తాత ఏడుకొండలు, జనసేన కన్వీనర్ మత్తి భాస్కరరావు, నీటి సంఘాల డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షులు ఎంఆర్‌కె మూర్తి, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దివి రాంబాబు, రేపల్లె పొలిటికల్ మేనేజర్ కుమార్ స్వామి, సాయి రాజేంద్ర, సొసైటీ అధ్యక్షులు దివి శ్రీనివాసరావు, చెన్నకేశవ స్వామి దేవస్థానం ఛైర్మన్ కందుల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ గోగినేని వసుధ, తహశీల్దారు సిహెచ్ పద్మావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్పి జి రామాంజనేయులు

సముద్రంలో చేపల వేట నిషేధం

ప్రజాశక్తి - బాపట్ల

సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుండి మిసైల్ ఆపరేషన్ జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 28 నుండి డిసెంబర్ 6 వరకు సముద్రంలో చేపల వేట నిషేధిస్తున్నట్లు డిఎస్పి గోగినేని రామాంజనేయులు తెలిపారు. రూరల్ పోలీస్ స్టేషన్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ, మత్స్య శాఖ అధికారుల సూచనల మేరకు నిషేధాన్ని ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సూర్యలంక, పాండురంగాపురం గ్రామాల మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి అనుమతించడం లేదని తెలిపారు. సమావేశంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇళ్లు తొలగిస్తే ఆందోళన తప్పదు

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ప్రజాశక్తి - బాపట్ల

సూర్యలంక సముద్రానికి అత్యంత దగ్గర్లో కడలిని నమ్ముకుని జీవనం సాగించే మత్స్యకారుల నివాసాలు తొలగించాలంటూ ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులతో ఆయన గురువారం మాట్లాడారు. ఎన్నో ఏళ్లగా చేపల వేట సాగిస్తూ జీవనం సాగిస్తూ ఇక్కడే నివాసాలు ఉంటున్న 35 కుటుంబాల ఇళ్ళను ఒక్కసారిగా తొలగించమని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. మత్స్యకారులపై ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇళ్ళు ఖాళీ చేయాలని ఒత్తిడి తేవటం సరైన పద్ధతి కాదని అన్నారు. సూర్యలంక అభివృద్ధి పేరుతో వీరిని అక్కడి నుండి తొలగించే అంశాన్ని పునరాలోచించాలని అన్నారు. వీరి నివాస ప్రాంతాలు సూర్యలంక



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న గంగయ్య

అభివృద్ధికి ఆటంకం కాద న్నారు. పేదలు నివసించే పూరిగుడిసెలు ఒక పక్కనే ఉన్నాయని అన్నారు. అదే ప్రాంతంలో నివాసం ఉండి జీవనం సాగించే విధంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. నిరుపేదల ఇళ్ళు తొలగించాలని చూస్తే ప్రజా సంఘాలతో కలిసి సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం చేస్తామని అన్నారు. ఆయన వెంట సిపిఎం నాయకులు టి కృష్ణ మోహన్, కె శరత్ పాల్గొన్నారు.

దేశాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెట్టొద్దు

ప్రజాశక్తి - పంగులూరు

దేశాన్ని, సార్వభౌమత్వాన్ని ప్రధాని మోడీ కార్పొరేట్లకు తాకట్టు పెడుతున్నాడని రైతు సంఘం నాయకులు నాగబోయిన రంగారావు అన్నారు. దేశాన్ని, వ్యవసాయాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ పోరాటంలోకి రావాలని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ ఉద్యమం ఐదేళ్ళు పూర్తయిన సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. దేశాన్ని ఆదాని, అంబానీ చేతుల్లో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని అన్నారు. వ్యవసాయ రంగం దివాళా తీయించేందుకు తెచ్చిన చట్టాలు రద్దు చేయాలని అన్నారు. రైతు పోరాటం ద్వారా విరమింప చేసిన ట్టాలు దొడ్డి దారిన అమలకు పూనుకుంటున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగాన్ని ముంచి, వ్యవసాయాన్ని దివాళి తీయించి భూములు కార్పొరేట్లకు అప్ప చెప్పేందుకు ప్రయత్నిస్తుందని



నిరసన తెలియజేస్తున్న రైతు సంఘం నాయకులు

అన్నారు. ఇప్పుడు లేబర్ కోడ్ తీసుకురావడం వలన కార్మికులకు ఏ హక్కు ఉండదని అన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ దేశ వ్యవసాయం కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. బర్లి పొగాకు రైతులకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మాజీ అధ్యక్షులు రాయని వినోద్ బాబు, తలపనేని సుబ్బారావు, ఆదం సాహెబ్, బాచిన హనుమంతరావు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ 'అన్నదాత సుఖీభవ'

'మీకోసం' సభలో మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - బల్లికురవ

అర్హత కలిగిన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ ద్వారా పెట్టుబడి సాయం అందిస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బల్లికురవ మండలంలోని చెన్నుపల్లిలో గురువారం నిర్వహించిన రైతు సేవలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిఎం చంద్రబాబు నాయకత్వంలోని తమ ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులు కూడా పంట మార్పిడిపై దృష్టి సారించి మెరుగైనా దిగుబడులు సాధించాలని కోరారు. సేంద్రీయ వ్యవసాయం దిశగా అన్నదాతలు అడుగులు వేస్తే బాగుంటుందని అన్నారు. పురుగుమందు వాడకం తగ్గించాలని సూచించారు. గత ప్రభుత్వం రైతులకు ధాన్యం కొనుగోలు డబ్బును చెల్లించలేదని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే డబ్బులు జమ చేస్తున్నామని పేర్కొన్నారు. మొదటి విడతలో ఇనాం భూముల రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు అందకపోవడంతో స్వయంగా తాను సీఎంతో చర్చించి సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. మొదటి విడత రూ.5వేలు అందని రైతులకు రెండో విడత రూ.5వేలు కలిపి జమ చేసినట్లు పేర్కొన్నారు. రెండవ విడత జమకాని ఇనాం రైతులకు త్వరలోనే వేస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ పరికరాలు 90 శాతం సబ్సిడీతో అందిస్తుందని తెలిపారు. అద్దంకి ప్రజల కోరికైన ఆర్‌డిఒతో పాటు ప్రకాశం జిల్లాలో కలపడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం 30 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, ఆరుగురుకి ఎల్‌ఓసీలు



మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

అందజేశారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 1922 మంది పేదలకు సీఎం సహాయ నిధి ద్వారా రూ.18 కోట్ల సహాయం అందించామన్నారు. మండలంలోని 462 మంది ఇనాం భూముల రైతులకు రూ.46.40 లక్షలు రైతు భరోసా కింద అందజేసినట్లు తెలిపారు. రెండో విడత అన్నదాత సుఖీభవ నగదు జమకాని ఈనాం భూముల రైతుల సమస్య త్వరలో పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. వోల్టేజ్ సమస్యకు తావు లేకుండా శాశ్వత పరిష్కారం చూపుతామని అన్నారు. గ్రామాల్లో లో వోల్టేజి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం 133 కెవి సబ్ స్టేషన్ నిర్మాణం త్వరలో కార్యరూపం దాల్చినట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.18.5కోట్లు సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ప్రతి ఉన్నత పాఠశాల విద్యార్థికి సైకిల్ అందజేశామని అన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ మలినీడు గోవిందరావు, తహశీల్దారు రవి నాయక్, ఎంపిడిఒ కుసుమ కుమారి, సిఐ వెంకట్రావు, ఎస్ఐ నాగరాజు, బల్లికురవ సొసైటీ అధ్యక్షులు గొట్టిపాటి లక్ష్మయ్య, యాగంటి సింగరయ్య, గొట్టిపాటి శంకర్ పాల్గొన్నారు.



యుటిఎఫ్ మహాసభలో మాట్లాడుతున్న నాయకులు

ఉపాధ్యాయులు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - పంగులూరు

గత 30ఏళ్లుగా పేరుకున్న రూ.30వేల కోట్ల ఉపాధ్యాయుల బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో గురువారం జరిగిన యుటిఎఫ్ మండల సర్వసభ్య సమావేశంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పల చెంచయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలు తక్షణమే పరిష్కరించాలని అన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించడం వలన విద్య కుంటుపడుతుందని అన్నారు. విద్యార్థులు నష్టపోవాల్సి వస్తుందని అన్నారు. ఉపాధ్యాయులను పూర్తిగా విద్యాబోధనకే ఉపయోగించాలని కోరారు. టెట్ పరీక్షల నుండి ఉపాధ్యాయులను మినహాయించాలని కోరారు.

యూటీఎఫ్ నూతన కమిటీ



రవిచంద్రబాబు రామాంజనేయులు

యుటిఎఫ్ మండల నూతన కమిటీ అధ్యక్షులు బి రవి చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి దామా రామాంజనేయులు, గౌరవాధ్యక్షులు జె కోటీశ్వరు నాయక్, ఉపాధ్యక్షులు బి సుబ్బారావు, బి మేరీ శ్యామల, కోశాధికారి షేక్ ఫిరోజ్ సాహెబ్ తోపాటు కోర్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్ కె సాయి సత్య నారాయణ, ఎస్‌విడి ప్రసాద్, ఎస్ఎల్ఎన్ సత్య నారాయణ, ఎం రమాదేవి, బావి శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పూనాటి హరిబాబు, జిల్లా కార్యదర్శి పాలపర్తి రామాంజనేయులు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జగన్నాథం బాబురావు, వి ఏడుకొండలు పాల్గొన్నారు.



నూతన కమిటీకి పత్రం అందిస్తున్న నరేంద్రవర్మ

షాదీఖానా అభివృద్ధికి ప్రణాళిక

ప్రజాశక్తి - బాపట్ల

ముస్లిం షాదీ ఖానాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోందని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద గల షాదీఖానా (ఉర్దూఘర్) నూతన కమిటీ ప్రమాణ స్వీకారంకు ఆయన హాజరయ్యారు. పట్టణంలో షాది ఖానాను మరింత అభివృద్ధి దిశగా నూతన కమిటీ కృషి చేయాలని కోరారు. నూతన కమిటీ సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. షాది ఖానా నూతన కమిటీ అధ్యక్షులు షేక్ అబ్దుల్ రషీద్, కార్యదర్శి సయ్యద్ ఆజాద్, సభ్యులు షేక్ సిరాజ్, షేక్ గఫార్, సయ్యద్ షమీమ్, పఠాన్ షాహినా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ రఫీ, జిల్లా అధ్యక్షులు పఠాన్ అహ్మద్ భాష, నియోజకవర్గ అధ్యక్షులు బాజీఖాన్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సుభాని, రైల్వే బోర్డు మాజీ సభ్యులు నియాజీ, టిడిపి మండల అధ్యక్షులు ఏపూరి భూపతిరావు, పఠాన్ పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపిడిఒగా మోహన్ చంద్

ప్రజాశక్తి-సంతమాగులూరు



ఎ మోహన్ చంద్

మండలంలోని గురిజేపల్లి గ్రామ గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శి ఎ మోహన్ చంద్‌కు జిఎస్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపిడిఒగా పదోన్నతి పొందిన సందర్భంగా గ్రామంలో ఎంపిడిఒ జ్యోతిర్మయి సమక్షంలో గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి దమ్ము వెంకటరమణ, శ్రీనివాసరావు, గుంటి పెద్దబ్బాయి, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

4న విద్యా సమస్యల పరిష్కారం కోసం బంద్

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ


విద్యా సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 4న కేజీ నుంచి పీజీ వరకు జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ పాటించాలని విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విద్యార్థి సంఘాలు జెఎసి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సిహెచ్. వినోద్, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్, ఏపీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుదు రాయపాటి జగదీష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి. రఘురాం బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మార్కాపురం మెడికల్ కాలేజీని పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించాలన్నారు. జిల్లాకు కేటాయించిన యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ కళాశాల నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించినప్పటికీ, విద్యా రంగ అభివద్ధిలో ప్రభుత్వాల నిర్లక్ష్యం కొనసాగుతోందని విమర్శించారు. ముఖ్యంగా పశ్చిమ మండలాల్లో విద్యా వెనుకబాటు తీవ్రంగా పెరిగిందన్నారు. జిల్లాకు కేటాయించిన యూనివర్సిటీ కేవలం బోర్డుకే పరిమితమై, నిధులు కేటాయించక నిర్మాణం నిలిచిపోయిందన్నారు. పీజీకి రీయింబర్స్మెంట్ రద్దు కావడంతో ఉన్నత విద్య కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.అర్హులైన విద్యార్థులందరికీ షరతులు లేకుండా తల్లికి వందనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేసి, జీవో 77 రద్దు చేసి పీజీ రీయింబర్స్మెంట్ పునరుద్ధరించాలన్నారు సంక్షేమ హాస్టళ్లకు మెస్ చార్జీలను ధరల పెరుగుదలకు అనుగుణంగా రూ 3,000 పెంచి, వార్డెన్- ట్యూటర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల విలీనాలను నిలిపివేసి, కార్పొరేట్ విద్యాసంస్థల నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాలన్నారు ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులందరికీ ఉచిత బస్సు పాసులు ఇవ్వాలన్నారు. మార్కాపురం, గిద్దలూరులో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఒంగోలులో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, చీమకుర్తిలో మైనింగ్ యూనివర్సిటీ, దర్శిలో డ్రైవింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.


బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మెప్మాలో అక్రమాలపై నిగ్గు తేల్చండి
మాజీ మంత్రి బాలినేని డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో జరిగిన అవినీతి, అక్రమాలపై నిగ్గు తేల్చాలని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు పేద మహిళలకు చేయూతను అందించటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మెప్మా సంస్థను ఏర్పాటు చేశారన్నారు. కొందరు అధికారులు, సిబ్బంది, రాజకీయ ప్రతినిధుల అండతో అక్రమాలకు పాల్పడటం సిగ్గు చేటన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారు ఏ పార్టీ వారైనా పేర్లు వెల్లడించాలని డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులను కోరారు. ఈ విషయంలో ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని ఆయన కోరారు. గత కొన్ని సంవత్సరాలుగా అక్రమాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయని, నాటి నుంచి నేటి వరకు జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేసి దోషులను చట్టం ముందు నిలపెట్టాలని బాలినేని డిమాండ్ చేశారు.


నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ మాగుంట


కిటికీలు అందజేస్తున్న నిడమనూరి సూర్యకళ్యాణ్ చక్రవరి

హైస్కూల్‌కు కిటికీలు అందజేత

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వికసిత భారత్ ట్రస్ట్ తరఫున డాక్టర్ నిడమనూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి ఒంగోలు అగ్రహారంలోని మున్సిపల్ హైస్కూల్‌కు రూ. 2 లక్షల విలువైన పది కిటికీలు, రెండు బీరువాలు గురువారం అందజేశారు. గతంలో హై స్కూల్ లో నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన క్విస్ విద్యా సంస్థల ఛైర్మన్, వికసిత భారత్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ నిడమనూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తిని కిటికీలు, బీరువాలు ఇవ్వాలని పాఠశాల సిబ్బంది కోరారు. అందజేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుని వాటిని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకి, ఆపదలో ఉన్న వాళ్లని ఆదుకునేందుకు అవసరమైన సాయం అందజేసేందుకు ట్రస్ట్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. లక్ష్మి ప్రసన్న సూర్య కళ్యాణ్ చక్రవర్తి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెగ్గం శ్రీనివాసరావు, రాయపాటి అజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాకినేని అమర సింహం, మహిళా నాయకురాలు తీగల సత్యవతి , గరికపాటి వంశీకష్ణ, కొప్పురి సతీష్, లక్ష్మి, కొమ్ము శ్రీనివాస్ రావు, ఊటుకూరి మహేష్, మాజీ మండల అధ్యక్షుడు గుర్రం రంగనాథ్ పాల్గొన్నారు.

లిఫ్ట్ ఏర్పాటుకు మంత్రి చర్యలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మరో లిఫ్ట్ అందుబాటులోకి రానుంది. 13 మంది వికలాంగులు ఒకేసారి వినియోగించుకునేలా లిఫ్ట్ నిర్మించేలా రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వికలాంగులు, వయోవద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం వికలాంగుల సంక్షేమ శాఖ నుంచి రూ.47 లక్షలను మంజూరు చేశారు. అందులో మొదటి విడతగా రూ.23.5 లక్షలను విడుదల చేశారు. వివిధ పనుల నిమిత్తం ప్రకాశం భవనానికి వచ్చే ప్రజలకు ఉపయోగపడేలా ఈ నిధులతో పనులు త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రాజాబాబుకు మంత్రి సూచించారు. వికలాంగులకు ప్రత్యేక టాయిలెట్లు, లిఫ్ట్ సౌకర్యాన్ని కల్పించేలా నిధులు విడుదల చేసిన మంత్రికి జిల్లా యంత్రాంగం కతజ్ఞతలు తెలిపింది. ఇప్పటికే ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఎంపీ ల్యాడ్స్ నిధులతో కలెక్టరేట్‌లో లిఫ్ట్ ఏర్పాటుకు సహకారమందించిన విషయం తెలిసిందే.లిఫ్ట్ ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామికి అధికారులు, వికలాంగులు అభినందనలు తెలిపారు.

రామనాథంకు అంతిమ వీడ్కోలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ, ప్రజాశక్తి బుక్‌హౌస్ మేనేజరు కొమ్మాలపాటి లక్ష్మయ్య మాతృమూర్తి రామనాథం బుధవారం మృతి చెందారు. వారి స్వగ్రామైన నాగులుప్పలపాడు మండలం ఒమ్మెవరం గ్రామంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. అంతిమ యాత్రలో పలువురు పాల్గొని రామ నాథం మతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అంతిమ వీడ్కోలు తెలిపారు ఈ కార్యక్రమంలో బాపట్ల ,ప్రకాశం జిల్లాల సిపిఎం నాయకులు ,వివిద ప్రజాసంఘాల నాయకులు వై.సిద్ధయ్య, ఎస్‌కె.మాబు, జె. జయంతిబాబు, వసంత రావు, పెంట్యాల హనుమంతరావు,కాలం సుబ్బారావు, దశరథ, కంకణాల ఆంజనేయులు, పూసపాటి వెంకట్రావు, బంకా సుబ్బారావు, వినోద్, మోంద్రు ఆంజనేయులు ,కందిమళ్ళ రామకోటేశ్వరరావు, ఐయ్యపురెడ్డి, ఉబ్బా ఆదిలక్ష్మి, కల్పన ,పద్మ, టి.శ్రీకాంత్ ,జి.బసవపున్నయ్య, యు. వెంకటేశ్వర్లు, లాయర్ రమేష్ ,ప్రజాశక్తి ఒంగోలు ఎడిషన్ మేనేజరు ఎంఎల్‌వి. ప్రసాదు, కుటుంబసభ్యులు బంధువులు తదితరులు పాల్గొన్నారు.


అంతిమ యాత్రలో పాల్గొన్న నాయకులు, బంధువులు

నిశ్చితార్థ వేడుకల్లో ఎంపీ మాగుంట

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తెలంగాణా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుమారుడు శ్రీ సూర్య విక్రమాదిత్య నిశ్చితార్థ వేడుకలు హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

10 లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో మార్చి-2026లో నిర్వహిస్తున్న పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి పరీక్ష ఫీజుల చెల్లింపు గడువును ప్రకటించారు. ఆ మేరకు డిసిఇబి కార్యదర్శి ఎం శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అపరాధ రుసుము లేకుండా డిసెంబర్ 1 నుంచి 10 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చునని పేర్కొన్నారు. రూ.25 అపరాధ రుసుంతో డిసెంబర్ 12 వరకు, రూ.50 అపరాధ రుసుంతో 15 వరకూ చెలించవచ్చునని పేర్కొన్నారు. ఫీజులు ఏపీ టి-ఆన్ లైన్ మరియు అపాస్ వెబ్‌సైట్ పేమెంట్ గేట్వే ద్వారానే చెల్లించాలన్నారు. డిసెంబర్ 16,17తేదీల్లో ఎస్ఆర్‌లు, ఎన్ఆర్‌లు సమర్పించాలన్నారు. ఫీజు చెల్లించిన తర్వాత అందించే రసీదులో సబ్జెక్టులు సరిగా ఉన్నాయో లేదో అభ్యర్థులు పరిశీలించుకోవాలన్నారు. తప్పు సబ్జెక్టుకు ఫీజు చెల్లిస్తే మళ్లీ చెల్లించాల్సి వస్తుందన్నారు. వికలాంగ విద్యార్థులకు పరీక్ష రుసుం మినహాయింపు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్, సేవా రుసుం చెల్లించాలన్నారు.

ఐక్యతతో కాంగ్రెస్ పార్టీని బలపరుస్తాం

ఎఐసిసి కార్యదర్శి నదీమ్ జావేద్ విమర్శలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మోడీ భారత రాజ్యాగం ద్రోహి అని, ఐక్యతతో కాంగ్రెస్ పార్టీని బలపరుస్తామని ఆలిండియా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి నదీమ్ జావేద్ తెలిపారు. పేద ప్రజలపై మోయలేని భారం మోపుతున్న కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంఘటన్ సజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డిసిసి కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై కార్యవర్గ సమావేశం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి డిసిసి అధ్యక్షుడు షేక్ సైదా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నదీమ్ జావేద్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ నేతత్వంలో దేశంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కషి చేయాలన్నారు. గ్రామస్థాయి నుంచి ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పని చేయాలన్నారు. రాష్ట్రంలో వైసిపి, తెలుగుదేశం పార్టీ బిజెపితో పొత్తు పెట్టుకొని మతం చిచ్చుపెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని గాలికి వదిలేసి చంద్రబాబు నాయుడు జగన్మోహన్ రెడ్డి నరేంద్ర మోడీతో అంటకాగుతూ వ్యవస్థల్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు షేక్ సైదా, పిసిసి సమన్వయ కర్తలు జాన్ బాబు,బివై. కిరణ్,రాణి మేకల సతీష్, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిఆర్. గౌస్, కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్రీపతి సతీష్ , కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డి.సుబ్బారెడ్డి, దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కైపు. కష్ణారెడ్డి, జిల్లా ఎస్‌సి చైర్మన్ మన్నం ప్రసన్న రాజు, సయ్యద్ జావెద్ అన్వర్, కెకెసి జనరల్ సెక్రటరీ సుధీర్ వర్మ, కిసాన్ సెల్ నాయకుడు కె. సుబ్బారావు, మైనార్టీ సెల్ నాయకుడు మహబూబ్ అలీ, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దాసరి రవి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎఐసిపి కార్యదర్శి నదీమ్ జావేద్

జీవో నంబర్ 127 అమలు పట్ల హర్షం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఎస్‌సి ఉద్యోగుల పదోన్నతుల్లో ఉపవర్గీకరణను అమలు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ 127 పట్ల మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుజన్ మాదిగ హర్షం వ్యక్తం చేశారు. ఒంగోలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఎస్‌సి రిజర్వేషన్లలో ఏ,బి, సి గ్రూపుల ఉపవర్గీకరణను అమలు చేసినట్లు తెలిపారు. అదే విధంగా పదోన్నతుల్లోనూ ఉపవర్గీకరణ ప్రారంభించడమే ఎస్‌పి ఉద్యోగుల దీర్ఘకాల డిమాండ్‌కు న్యాయం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పిఎస్ ప్రతినిధులు గద్దె త్యాగరాజు, కొలకలూరి విజయ్ కుమార్, తేళ్ల జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.


చిననారులను ఆశీర్వదిస్తున్న కరణం బలరామకృష్ణమూర్తి

చిన్నారులకు 'కరణం' ఆశీర్వాదం

ప్రజాశక్తి - బల్లికురవ

మండలంలోని వేమవరంలో చీరాల మాజీ ఎంఎల్ఎ కరణం బలరామకృష్ణమూర్తి గురువారం పర్యటించారు. గ్రామానికి చెందిన ప్రత్తిపాటి శివయ్య, సూర్యనారాయణమ్మ మనుమరాలు కౌసల్యాదేవి, ఖ్యాతి సాయి శ్రీ, నైనిక శ్రీ నూతన వస్త్ర బహూకరణకు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుండి కరణం అభిమానులు తరలివచ్చి తన అభిమాన నేతను ఆప్యాయంగా పలకరించారు. పేరు పేరునా పలకరిస్తూ కరణం ప్రేమాభిమానాలు చూపారు. ఈ సందర్భంగా ఆయన వెంట వైసిపి కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, గోరంట్ల రవిబాబు పాల్గొన్నారు.


కంప్యూటర్ బహుకరిస్తున్న దృశ్యం

కంప్యూటర్ బహూకరణ

ప్రజాశక్తి - బల్లికురవ

మండలంలోని ముక్తేశ్వరం ప్రాథమిక ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల పూర్వ ప్రధాన ఉపాధ్యాయుడుగా సేవలందించిన కారసాని అంజిరెడ్డి జ్ఞాపకార్థం తన కుటుంబీకులు కారసాని వెంకట పోలిరెడ్డి, చంటి వెంకట్రెడ్డి గురువారం ఆ పాఠశాలకు కంప్యూటర్ పరికరాలు బహుకరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ రమేష్ బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మరింత విద్యాభివృద్ధి కొనసాగాలంటే ఆయా గ్రామాల్లోని పూర్వ విద్యార్థులు పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో తమ వంతు చేయూత ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పి సురేష్, ఎంపిటిసి అట్లూరి నాగేశ్వరరావు, కొండేటి ఇజ్రాయిల్, సింగంశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.


విజయం సాధించిన చందలూరు విద్యార్థులు

చందలూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పంగులూరు

రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో మండలంలోని చందలూరు జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో 69వ ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలు నిర్వహించారు. పాఠశాలకు చెందిన నాయపాము శృతి ట్రెడిషనల్ సింగిల్స్‌లో ప్రథమ స్థానం, అండర్ 14 విభాగంలో ఆర్టిస్టిక్ ఫెయిర్‌లో నాయపాము శృతి, హెప్సిబా ప్రథమ, అండర్14 బాలుర విభాగంలో ఆర్టిస్టిక్ ఫెయిర్‌లో ఎం వెంకటేష్ ప్రథమ స్థానాన్ని సాధించి కలకత్తాలో జరిగే జాతీయ స్థాయి యోగాసన పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల పిడి కె ప్రతిమ తెలిపారు. ఆర్టిస్టిక్ సింగిల్‌లో ఎన్ భవ్యశ్రీ రెండవ స్థానం, ఆర్టిస్టిక్ ఫెయిర్‌లో ఎన్ రత్నకుమారి, ఎన్ భవ్యశ్రీ రెండవ స్థానాన్ని గెలుచుకున్నారని తెలిపారు. రిథమిక ఫైర్‌లో ఎ లిఖిత, ఎన్ భవ్యశ్రీ రెండవ స్థానంలో నిలిచి ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లో మూడవ స్థానం గెలుచుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీలు విజయవంతంగా నిర్వహించినందుకు హెచ్ఎం చందలూరు గిరిజ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, పీడీలు మధు, ప్రతిమను గ్రామస్తులు అభినందించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - రేపల్లె

క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ జిల్లా పరిశీలకులుగా విచ్చేసిన శరత్ అహార్ అన్నారు. పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో మోపిదేవి శ్రీనివాసరావు అపార్ట్మెంట్లో జరిగిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఎన్డీఏ ప్రభుత్వంపై చేస్తున్న ఆందోళన పాదయాత్రలు వంటివి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మద్దతు పలకాలని కోరారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌ను గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ఇప్పటి నుండే కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. రాష్ట్రాన్ని బలహీన పర్చడానికి బిజెపికి వైసిపి, టిడిపి మద్దతు తెలిపాయని అన్నారు. ఇటీవల జరిగిన బీహార్ ఎన్నికలు సరిగా జరగలేదని అన్నారు. రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఇంచార్జ్ మోపిదేవి శ్రీనివాసరావు మాట్లాడుతూ నైతిక విలువలు కట్టుబడి పిసిసి అధ్యక్షురాలు షర్మిలారెడ్డి, ఎఐసిసి సభ్యులు, మాజీ కేంద్రమంత్రి జెడి శీలం తనపై ఒత్తిడి తీసుకుని వచ్చి


మాట్లాడుతున్న పిసిసి పరిశీలకులు శరత్ అహార్

2024 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో అఇష్టంగా పోటీ చేశానని అన్నారు. తాను మొదటి నుండి కాంగ్రెస్ అభిమానిగా, కార్యకర్తగా ఉంటూ కాంగ్రెస్ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు మధ్య ఐక్యత పెంపొందే విధంగా పనిచేసినట్లు తెలిపారు. తాను ప్రస్తుతం వ్యాపారాల్లో బిజీగా ఉన్నందున కాంగ్రెస్ ఇన్చార్జిగా తప్పుకుంటున్నట్లు శ్రీనివాసరావు బహిరంగంగా ప్రకటించారు. ఇన్చార్జిగా ఎవరికి అవకాశం ఇచ్చిన తాను సహకారం అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా శరత్ అహర్‌ను ఘనంగా సత్కరించారు. సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంటా అంజిబాబు, తాత్కాలిక ఇంచార్జి కోపనాతి అంజిబాబు, నగరం అధ్యక్షులు తాళ్లూరి నారాయణ పాల్గొన్నారు.

వికలాంగ పిల్లలకు ఆటల పోటీలు


క్యారంబోర్డు ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - సంతమాగులూరు

పారా ఒలింపిక్స్ (దివ్యాంగులు) పోటీల్లో పాల్గొనే వారిని ప్రోత్సహించి వారికి తగిన శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంఇఒలు వి కోటేశ్వరరావు, దినేష్ కుమార్ తెలిపారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో సబ్ జూనియర్, జూనియర్ స్థాయిలో ఆటల పోటీలు గురువారం నిర్వహించారు. విద్యార్థులకు రన్నింగ్ రేస్, స్కిప్పింగ్, క్యారమ్స్, షాట్ పుట్, డిస్కస్ త్రో వంటి ఆటలు పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు ఈనెల 29న జిల్లాస్థాయిలో బాపట్లలో జరిగే పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. హెచ్ఎం ఎం బాలి, ఐఈఆర్‌టిలు జి పిలిప్‌రెడ్డి, సిహెచ్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పంగులూరు : విభిన్న ప్రతిభావంతులైన దివ్యాంగ బాల, బాలికలకు స్థానిక ఉన్నత పాఠశాల్లో వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. డిసెంబర్ 3న విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా రన్నింగ్, మ్యూజికల్ చైర్స్, హై జంప్, లాంగ్ జంప్, జావీన్ త్రో, డిస్కస్ త్రో ఆటలు కాంప్లెక్స్ హెచ్ఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు 29న జిల్లా స్థాయిలో పోటీలు జరుగుతాయని హెచ్ఎం సోమేపల్లి శ్రీనివాసరావు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రావి శ్రీనివాసరావు, స్పెషల్ ఎడ్యుకేటర్ దామరాజు భాస్కరమూర్తి, ఐఈఆర్‌పిలు యోహాను, అరుణ పాల్గొన్నారు.


విభిన్న ప్రతిభావంతులతో ఉపాధ్యాయులు

పాఠశాలకు స్థలం ఇచ్చిన దాతలు

ప్రజాశక్తి - బాపట్ల

గజం ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా చేసే ఈ రోజుల్లో ఎంతో ఉదార స్వభావంతో ప్రభుత్వ పాఠశాల కోసం 8 సెంట్ల స్థలం ప్రభుత్వానికి దానం చేశారు. గత ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాల వ్యవస్థను రద్దు చేయడంతో బేతపూడిలో పాఠశాల లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భేతపూడి నుండి వెదుళ్ళపల్లి పాఠశాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. బేతపూడి, వెదుళ్ళపల్లి మధ్య విజయవాడ, చెన్నై ప్రధాన రైల్వే లైన్లతో విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదీకాక ఈ మార్గంలో మూడో రైల్వే లైన్ ఏర్పడడంతో నిరంతరం రైళ్ల రద్దీ పెరిగింది. చదువుల కోసం రైలు పట్టాలు దాటి పాఠశాలకు పిల్లలను పంపాలంటేనే గ్రామస్తులు భయపడుతున్నారు. విద్యార్థులకు చదువు దూరం కాకూడదనే సంకల్పంతో గ్రామంలోనే ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేసేందుకు అధికారులతో సంప్రదించి స్థలాన్ని ప్రభుత్వానికి దానం చేశారు. చదువుల కోసం పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించిన గ్రామస్తులు స్వచ్ఛందంగా గ్రామంలోనే ఒకే ఇంటి పేరుకు చెందిన కుటుంబానికి చెందిన నాయుడు వెంకటేశ్వరరెడ్డి, నాయుడు బుచ్చిరెడ్డి, నాయుడు


స్థల దాన పత్రాన్ని ఎంపిడిఒకు అందిస్తున్న దాత

సుబ్బారెడ్డి, నాయుడు బ్రహ్మారెడ్డి, నాయుడు శ్రీనివాసరెడ్డి, నాయుడు జయరామిరెడ్డి కలిసి 8 సెంట్లు భూమిని పాఠశాల కోసం ఎంపిడిఒకు రిజిస్ట్రేషన్ చేసిన స్థల దాన పత్రాన్ని ఎంపిడిఒ బాబురావు, ఎంఇఒ ఎస్ నిరంజన్ సమక్షంలో గురువారం అందజేశారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు పాఠశాలల దాటికి విద్యార్థులు లేక ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్న పరిస్థితుల్లో బేతపూడిలో విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాల కావాలని స్థలదాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎంపిడిఒ బాబురావు స్థలదాతలను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ రామకృష్ణ, బేతపూడి పంచాయతీ కార్యదర్శి ఎం మాణిక్యం, గ్రామానికి చెందిన పుట్టా శ్రీనివాసరెడ్డి, సారథి, విజయబాబు పాల్గొన్నారు.


క్రీడాకారుడిని అభినందిస్తున్న హెచ్ఎం శ్రీనివాసరావు

ఖోఖో జాతీయ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - పంగులూరు

మండల కేంద్రమైన పంగులూరు జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం సోమేపల్లి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఈనెల 22, 23, 24, తేదీల్లో జరిగిన ఎస్‌జిఎఫ్ స్కూల్ గేమ్స్ అండర్ 17 బాలుర రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు కాకినాడలో జరిగాయి. ఈ పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఈ జట్టులో తమ పాఠశాల 10వ తరగతి విద్యార్థి పేరం వెంకటేశ్వర్లు ప్రకాశం జిల్లా జట్టులో అత్యంత ప్రతిభ కనపర్చి జట్టు ప్రథమ స్థానం సాధించేందుకు కృషి చేశాడు. వెంకటేశ్వర్లు ప్రతిభ గుర్తించి, ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో డిసెంబర్ నెల 24 నుండి జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ఆడేందుకు అధికారులు ఎంపిక చేశారు. క్రీడాకారుడు వెంకటేశ్వర్లు, పిడి హరిబాబును ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు అభినందించారు. క్రీడాకారుడు వెంకటేశ్వర్లు గతంలో అండర్ 14 సబ్ జూనియర్స్ విభాగంలో కర్ణాటక, జార?ండ్‌లలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. స్థానిక ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ నిర్వాహకులు మేకల సీతారాంరెడ్డి ఆధ్వర్యంలో క్రీడాకారుడు వెంకటేశ్వర్లు శిక్షణ పొందాడు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రోటరీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - పంగులూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని కోటపాడు జెడ్పి ఉన్నత పాఠశాల్లో క్విజ్ పోటీలు గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో రేణంగివరం జెడ్పి ఉన్నత పాఠశాలకు ప్రథమ బహుమతి, కొండ మంజులూరు పాఠశాలకు 2వ బహుమతి, కోటపాడు పాఠశాలకు మూడో బహుమతి లభించింది. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బత్తుల వీరనారాయణ, రాయిని రామారావు మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు ఇప్పటి నుండే తర్ఫీదు పొందాలని అన్నారు. ఈ ప్రాంతంలో విద్యా రంగ అభివృద్ధికి రోటరీ క్లబ్ పనిచేస్తుందని అన్నారు. విద్యార్థులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశం ఎంతో అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. ఆ అభివృద్ధికి అనుగుణంగా విద్యార్థులు చదువుకొని ఉన్న శిఖరాలకు ఎదగాలని కోరారు. ఈ కాలంలో విద్యార్థులకు పోటీ పరీక్షలు, క్విజ్, ఇతర పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అనంతరం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ ట్రెజరర్ కాలి షావలి, రొటేరియన్స్ పేర్ని వీర నారాయణ, తాటిచిన సుబ్బారావు, గరిమిడి జగన్మోహనరావు, కోటపాడు జెడ్పి ఉన్నత పాఠశాల హెచ్ఎం వి వేణుబాబు, అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ పాల్గొన్నారు.

గ్రామాల్లో క్రిస్మస్ సందడి

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండలంలోని గ్రామాల్లో క్రిస్మస్ సందడి ప్రారంభమైందిన డిసెంబర్ 25న క్రిస్మస్ వేడుకల సందర్భంగా గ్రామాల్లో భారీ క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేసే పనులు జోరుగా సాగుతున్నాయి. స్టార్లను రంగు రంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించడంతో గ్రామాలు పండుగ వెలుగుల్లో మెరిసి పోతున్నాయి. మండలంలోని ప్రజ్ఞం, కూచినపూడి, పర్లమెరక, గ్రామంలో స్థానికులు, యువకులు కలిసి అమర్చిన భారీ స్టార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువకులు స్వయంగా శ్రమించి అలంకరించిన ఈ స్టార్ రాత్రి వేళ ప్రజలను కనువిందు చేస్తూ గ్రామానికి పండుగ వాతావరణాన్ని మరింత చేర్చుతోంది.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని ముప్పవరం, జాగర్లమూడి వారిపాలెం మధ్యలో ఆగిఉన్న లారీని వెనక వైపు నుంచి వచ్చి ఢీకొన్న లారీ క్లీనర్ ఆరీఫ్ (35) మృతి చెందగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. కరెంటు స్తంభాలు లోడుతో గుంటూరు వైపు నుండి ఒంగోలు వైపుకు లారీ వెళుతుంది. జాగర్లమూడి వారిపాలెం సమీపంలోని పరమేశ్వరరావు హెూటల్ దగ్గరలో టాయిలెట్‌కు వెళ్లేందుకు లారీ డ్రైవర్ లారీని రోడ్డు ప్రక్కకి తీస్తున్నాడు. ఇదే సమయంలో అదే రోడ్లో వెనకవైపు వస్తున్న లారీ ఒకసారిగా ముందున్న లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో ఢీకొన్న లారీ ముందు భాగం భారీగా దెబ్బతింది. ఆ లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాల య్యాయి. క్లీనర్ ఆరిఫ్‌కు బలమైన గాయాలు కావడంతో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి అక్కడి నుండి ఒంగోలు రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆరిఫ్ హర్యానాలోని గౌహుతికి చెందిన వాడు. రేడింగవరం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మేదరమెట్ల : ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుండి లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మేదరమెట్ల బైపాస్‌లో చోటుచేసుకుంది. ఒంగోలు నుండి గుంటూరు వెళుతున్న లారీ ముందు వెళుతున్న ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులను ఢీకొంది. అక్కడికక్కడే ఒక వ్యక్తి మృతి చెందగా రెండో వ్యక్తి వెళ్లిపోయినట్లు లారీ డ్రైవర్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటన స్థలానికి ఎస్ మహమ్మద్ రఫీ చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

డిసెంబర్ 15న ఎన్‌జిఒ ఎన్నికలు

ప్రజాశక్తి - అద్దంకి

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ తాలూకా యూనిట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. 16 పదవులకు ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితా ఎన్జీఒ హెూంలో ప్రదర్శించారు. ఈ లోపు ఎవరైనా మిగిలిపోయిన ఓటర్స్ ఉంటే ఎన్నికల అధికారికి రూ.300 సబ్ స్క్రిప్షన్ చెల్లించి సభ్యత్వం పొందవచ్చని ఎన్‌జిఒ నాయకులు తెలిపారు. సబ్ స్క్రిప్షన్ రుసుం 86392 27975కు ఫోన్ పే ద్వారా చెల్లిస్తూ ఉద్యోగి పేరు, హెూదా, డిపార్ట్మెంట్, ఎంప్లాయి ఐడి లేక సిఎఫ్ఎంఎస్ ఐడి, మొబైల్ నెంబర్ వివరాలు తెలపాలని సూచించారు. డిసెంబర్ 8న నామినేషన్లు స్వీకరించనున్నారు. డిసెంబర్ 15న ఎన్జీఒ హెూంలో ఎన్నికలు, లెక్కింపు జరుగుతాయని తెలిపారు. అనంతరం ఎన్నికైన తాలూకా కార్యవర్గాన్ని ప్రకటిస్తామని తెలిపారు. ఈ



కార్యవర్గానికి ఎన్నికల నోటిఫికేషన్ అందజేస్తున్న దృశ్యం

ఎన్నికల ప్రక్రియకు చీరాల తాలూకా యూనిట్ ట్రెజరర్ కెపి దాసు సహా ఎన్నికల అధికారిగా, బాపట్ల జిల్లా అడ్డహాక్ కమిటీ సభ్యులు బి రాజేష ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ కాపీని ప్రస్తుత అధ్యక్షులు జి కిరణ్ కుమార్, కార్యవర్గానికి అందజేశారు. జిల్లా అడహాక్ కమిటీ ఛైర్మన్ పి నాగేశ్వరరావు, కన్వీనర్ బి ప్రసాదరావు పాల్గొన్నారు.

కేర్ వాలంటీర్ల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - చీరాల

పేద విద్యార్థులకు విజయనగరకాలనీ రోడ్డులోని బిఎస్పీ కార్యాలయంలో ట్యూషన్ సెంటర్ ఏర్పాటు చేసి వారికి ఒక పూట భోజన వసతి కల్పిస్తున్న కేర్ వాలంటీర్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనియమని ఐక్య నగర్ కాలనీ సంక్షేమ ప్రతినిధులు అన్నారు. కేర్ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా కాలనికి చెందిన విద్యార్థులకు భోజనం తోపాటు వృద్ధులు, వితంతువులకు ఏర్పాటు చేశారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎం



అల్పాహారం అందిస్తున్న కేర్ ప్రతినిధులు

రత్న కుమారీ, జి మహేశ్వరీ, కాలనీ అధ్యక్షులు దైవ సహాయం, ప్రశాంత్ రాజు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

సమర్థత సర్వే

ప్రజాశక్తి - చిన్నగంజాం

ఫౌండేషన్ లిట్రసి న్యూమరసి కార్యక్రమంలో భాగంగా 3వ రోజు పివిఎస్ పాఠశాల్లో విద్యార్థి సమర్థత, నైపుణ్యం విలువల సర్వే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రకాశం జిల్లా డిఇఒ కిరణ్, మైనంపాడు డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు అధ్యక్షతన జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కుర్రా రామారావు పర్యవేక్షణ చేశారు. కార్యక్రమంలో డైట్ ఝాన్సీ, కాలేజీ స్టూడెంట్ అర్చన, సిఆర్‌పి ఎన్ సునీల్ సర్వే వివరాలు ఆన్లైన్లో నమోదు చేశారు.

ప్రతిభా మూర్తుల మధుర స్మృతులు

ప్రజాశక్తి - అద్దంకి

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో ప్రతిభా మూర్తులు 48వ సభ గురువారం నిర్వహించారు. విద్వాన్ జ్యోతి చంద్రమౌళి జ్యోతి, పొన్నూరి వెంకట శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పిహెచ్ కోటయ్య, అన్నం నేని వెంకటరావు, పుట్టంరాజు శ్రీ రామ చంద్రమూర్తి, కాకాని లేవి ప్రసాద్, చప్పిడి వీరయ్య, చెన్నుపాటి రామాంజనేయులు, మలాది శ్రీనివాసరావు, బాచిన పూర్ణ చంద్రరావు, పంతంగి ఆంజనేయులు, యువి బ్రహ్మం, షేక్ మస్తాన్, హరి ప్రసాద్, నాగేశ్వరావు, కోట అంజమ్మ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - కర్లపాలెం

పూరి గుడిసెల్లోని గిరిజన వృద్ధులకు దుప్పట్లను కరుణ జీవన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇనకొల్లు పోలీసురావు పంపిణీ చేశారు. తన స్నేహితుడు బొంత సామ్యూల్ త్యాగరాజ్ సహకారంతో గణపవరంలో 30 గిరిజన కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పేర్ల ధనుంజయరావు, గిరిజన నాయకులు ఏకశిర నరసింహారావు పాల్గొన్నారు.

అద్దంకి : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ముద్దబాటి శ్రీను, రోటరీ ప్రెసిడెంట్ పూర్ణచంద్రరావు సౌజన్యంతో దర్శి రోడ్డులోని గుండ్లకమ్మ తీరంలో నివసిస్తున్న సంచార జాతులకు దుప్పట్లు, వస్త్రాలు, పండ్లు అందించారు.

మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవాలి

ప్రజాశక్తి - నిజాంపట్నం

రైతులు మద్దతు ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాలని తహశీల్దార్ మోర్ల శ్రీనివాసరావు అన్నారు. పల్లపట్లలో రైతులు ఆరబోసిన ధాన్యం నాణ్యత, తేమ శాతం ఎఒ విజయరాజుతో కలిసి గురువారం పరిశీలించారు.

రేపల్లె : మండలంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ ఎ మహేష్ బాబు సూచించారు. పేటేరులో వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. మండలంలో 8 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విఎఎ రాయల్ బాబు పాల్గొన్నారు.



మురళీమోహన్‌ను అభినందిస్తున్న మంత్రి లోకేష్

మురళీమోహన్‌కు అభినందన

ప్రజాశక్తి - బట్టిప్రోలు

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల మాక్ అసెంబ్లీ నిర్వహణకు స్కర్ట్ నిర్వహణలో క్వశ్చన్ అవర్ స్క్రిప్ట్ రైటింగ్, శాసన సభ బిల్లు తయారులో వెల్లటూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గుర్రం మురళీ మోహన్ కృషిని మంత్రి నారా లోకేష్ అభినందించారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల నుండి ఎంపికైన 175 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి మురళీమోహన్‌ను నియమించారు. విద్యార్థుల మాక్ అసెంబ్లీలో ప్రొటెం స్పీకర్, స్పీకర్, మంత్రి మండలి, ప్రతిపక్షం, మార్షల్స్ ఏ విధంగా శాసనసభ కార్యక్రమాలు నిర్వహించాలి, ఏ విధంగా చర్చించాలి, బిల్లు ప్రవేశపెట్టే విధానం తర్ఫీదు ఇచ్చారు. రాష్ట్రస్థాయి కార్యక్రమానికి శిక్షణ ఇచ్చినందుకు పాఠశాల హెచ్‌ఎం అరుణకుమారి, శ్రీనివాసరావు, కుటుంబరావు, ఆశాలత, శైలజ, కిషోర్, విజయ లక్ష్మీ, బేబీ అభినందించారు.



కరాటేలో రికార్డు నమోదు చేసుకున్న అఖిల్

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు నమోదు

ప్రజాశక్తి - సంతమాగులూరు

కరాటే కిక్స్‌లో ప్రపంచ స్థాయి లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన సత్తా చాటి మండలంలోని వెల్లలచెరువుకు చెందిన గంటెనపాటి అఖిల్ అలియాస్ ఇజ్రాయిల్ పేరు నమోదు చేసుకున్నారు. బాలాజీ హై స్కూల్‌లో పాఠశాల యాజమాన్యం గురువారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల అధినేత కొండారెడ్డి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కరాటేలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడి విజయం సాధించడం అఖిల్‌కు క్రీడల పట్ల ఉన్న ఆసక్తికి నిదర్శనమన్నారు. తమ పాఠశాల విద్యార్థులకు క్రీడలకు కోచ్‌గా వచ్చినప్పటి నుండి ప్రతి నెల ఏదో ఒక ఈవెంట్‌లో తమ విద్యార్థులు మెడల్స్ సాధించి పాఠశాల ప్రతిష్టను రాష్ట్ర స్థాయికి తీసుకువెళ్లగలిగారని అన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ కరిమున్, సీనియర్ జర్నలిస్ట్ బి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం

ప్రజాశక్తి - చిన్నగంజాం

ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల ఆరోగ్యకరంగా ఉంటారని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్‌హెచ్ హుస్సేన్ అన్నారు. మండలంలోని కడవకుదురులో ఆయన గురువారం పర్యటించారు. 'రైతన్న మీకోసం'లో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని అన్నారు. రైతులకు పోలిక్రఫ్ కిట్స్ గురించి వివరించారు. మహిళా సంఘాలతో కిచెన్ గార్డెన్ వేయించారు. క్యాడర్ విజయశాంతి వేసిన కిచెన్ గార్డెన్ మహిళలకు చూపించారు. ఇంటి పెరట్లో పండించుకున్న కూరగాయలు, ఆకుకూరలతో ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డిపిఎం ఎన్‌ఎఫ్ఎ శ్రీవల్లి, మాస్టర్ ట్రైనర్ భారతి, ఇంచార్జ్ జయమ్మ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్‌ఒ ప్లాంట్ బహూకరణ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

జడ్పిటిసి మర్రివాడ వెంకట పావని, ప్రసాద్ ఆర్‌ఓ ప్లాంట్‌ను పాఠశాలకు బహుకరించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరులు శివప్రసాద్ ప్లాంటు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు తాతా ఏడుకొండలు, జనసేన పిఒసి మత్తి భాస్కరరావు, ఎంఆర్‌కె మూర్తి, దివి రాంబాబు, కందుల వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం కాటూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ప్లాస్టిక్ రహిత చీరాలకు ప్రతిజ్ఞ చేస్తున్న చైర్మన్ సాంబశివరావు

'ప్లాస్టిక్ రహిత చీరాల'కు కృషి చేద్దాం

ప్రజాశక్తి - చీరాల

ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు, ప్లాస్టిక్ రహిత చీరాలగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని మునిసిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్, ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని అన్నారు. అనంతరం ఆ సంస్థ ప్రతినిధులు ఈ సందర్భంగా స్టీలు వాటర్ బాటిల్స్ అందించారు. అనంతరం ప్లాస్టిక్ రహిత చీరాల పోస్టర్ ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ శ్రీనివాసన్, టిపిఒ కె శ్రీనివాసులు, ఎఇ రవికుమార్, ఎన్విరాన్మెంట్ ఎఒ గీతాశ్రీ, అనీల, సూచేంద్ర, శాంతి కుమారి, కనకవల్లి, సృజన పాల్గొన్నారు.



ఫ్రిజ్ బహుకరిస్తున్న దాతలు

ఆలయానికి ఫ్రిజ్ బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం సన్నిధికి నిత్య కైంకర్యాలకు ఉపయోగించే పదార్థాలు పాడవకుండా ఉండడం కోసం హైదరాబాద్ చెందిన మందపాటి పవన్ కుమార్, అలేఖ్య దంపతులు స్వామివారి గర్భగుడిలో రిఫ్రిజిరేటర్‌ను పాలక మండలి అధ్యక్షులు చుండూరి మురళీ సుధాకరరావుకు అందజేశారు. పాలక మండలి సభ్యులు బత్తుల చంద్రశేఖర్, ఏల్చూరి వెంకట నారాయణమ్మ గోపికృష్ణ, ఆకుల కోటేశ్వరమ్మ కోటేశ్వరరావు, ప్రధాన అర్చకులు కోట లక్ష్మీనారాయణ, ఆచారి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కల్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి - పర్చూరు

మండల కేంద్రమైన పర్చూరు వై జంక్షన్ వద్ద గల కపిలస్తులో వేంచేసి ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని ప్రారంభించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. భక్తుల వివాహాది శుభకార్యాలు నిర్వహించుకోవడానికి నిర్మాణం చేసిన్నట్లు తెలిపారు. నిర్మాణానికి సహకరించిన దాతలకు కమిటీ అధ్యక్షులు కోట హరిప్రసాదు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీతారామ స్వామి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టి శివ నాగేశ్వరరావు, ఆర్ రామాంజనేయులు, ఆర్ మారుతి, వెంకటస్వామి, జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - బల్లికురవ

మండలంలోని కొప్పెరపాడులో మేదరమెట్ల, నార్కెట్పల్లి రాష్ట్రీయ రహదారిపై హైదరాబాద్ నుండి చెన్నై వైపు వెళుతున్న భారీ కాబిన్ ఉన్న లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా రోడ్డుకు తూర్పు వైపు ఉన్న నాలుగు వ్యవసాయ పనిముట్లు తయారు చేసే కొలుములు, కార్ఖానాలపై లారీ దూసుకెళ్ళింది. ఆ సమయంలో ఐదుగురు ఆయా కార్ఖాణాల్లో ఉన్నారు. రెప్పపాటులో వేగంగా దూసుకురావడంతో తప్పించు కునే ప్రయత్నం చేశారు. సిమెంట్ రేకుల షెడ్డుపైన పడటంతో స్వల్ప గాయాలు అయ్యాయి. రూ.10లక్షల ఆస్థి నష్టం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భూ సేకరణను పూర్తి చేయాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం వినియోగంలోకి రావాలంటే భూ సేకరణ తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకానికి భూ సేకరణపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎత్తిపోతల పథకానికి భూమిలిచ్చిన రైతులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. చట్టం నిబంధనలు అనుసరించి రైతులకు మేలు చేయడానికే అధికారులు ఉన్నారని తెలిపారు. ఈ పథకానికి 340.23 ఎకరాల భూ సేకరణ పెండింగ్‌లో ఉందన్నారు. కొరిశ పాడు మండలం పమిడిపాడు రెవెన్యూ గ్రామం పరిధిలో భూమి సేకరణకు 2011 సంవత్సరంలోనే అధికారికంగా ప్రకటన జారీ చేసినట్లు తెలిపారు. 2013 భూ సేకరణ సవరణ చట్టం ఆధారంగా నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు కోర్టును ఆశ్రయించడం తోనే పెండింగ్‌లో ఉందన్నారు. రైతుల అభిప్రాయాలను సేకరించి జిల్లా కలెక్టర్ నిర్ణయంపై నివేదిక ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించిందన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో ఉప కలెక్టర్ విజయ జ్యోతికుమారి, పమిడిపాడు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణను వేగవంతం చేయాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. ధాన్యం సేకరణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్ నుంచి గురువారం వీక్షణ సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం సేకరణ ప్రక్రియలో మరింత వేగం పెంచాలని ఆదేశించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు ఆయా మండలాలకు వెళ్లి అక్కడే ఉండాలన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి తక్షణమే కలెక్టరేట్‌కు సమాచారం పంపాలన్నారు. అధికారులకు కేటాయించిన ఆయా ప్రాంతాలలో విస్తతంగా పర్యటించాలన్నారు. ఈనెల 30న , డిసెంబర్ 1న బాపట్ల జిల్లాలో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించిందన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలను దష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైనన్ని టార్పాలిన్ పట్టలు కొనుగోలు చేశామన్నారు. వర్షం రాకముందే ధాన్యం ఆరబెట్టుకునేలా అవగాహన కల్పిం చాలన్నారు. రైతు సేవా కేంద్రాలకు గోనె సంచులు సమద్ధిగా కేటాయించామన్నారు. రైతులు ఎవరు కాల్ చేసినా అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. జిపిఎస్ నమోదు చేసుకున్న వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 505 వాహనాలను ఆర్ఎస్‌కె లకు అనుసంధానించామన్నారు. అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవ హరించాలని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట, డిఆర్ఒ జి.గంగాధర్ గౌడ్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జమీర్ బాషా, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, ఆర్‌డిఒలు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

ధరణి ఇన్ఫ్రాలో పెట్టుబడి భవిష్యత్తుకు రాబడి : దామచర్ల

ప్రజాశక్తి- ఒంగోలు

ధరణి ఇన్ఫ్రాలో పెట్టుబడి భవిష్యత్తుకు రాబడి అని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు తెలిపారు. ధరణి ఇన్ఫ్రా వారి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర హోమ్స్ గృహ నిర్మాణాలకు గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధరణి ఇన్ఫ్రా ఆధ్వర్యలో ఇప్పటివరకు చేపట్టిన ప్రాజెక్టులు సూపర్ సక్సెస్ అయినట్లు తెలిపారు. అంతకుమించి శ్రీ వెంకటేశ్వర హోమ్స్ ప్రాజెక్ట్ నిర్మిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు . ధరణి ఇన్ఫ్రా ఆధ్వర్యంలో ఇప్పటివరకు నిర్మించిన పలు ప్రాజెక్టులు మంచి వాతావరణంలో నిర్మించి కస్టమర్లకు అందించినట్లు తెలిపారు. అదేవిధంగా ఇప్పుడు స్థానిక మంగమ్మ కాలేజ్ వెనుక వైపు వెంకటేశ్వర నగర్‌లో శ్రీ వెంకటేశ్వర హోమ్స్‌లో వెంకటాద్రి, గరుడాద్రి, నారాయణద్రి, అంజనాద్రి పేర్లతో నాలుగు బ్లాకులు ఏర్పాటు చేసి ప్రతి ప్లాటు భవనాన్ని తూర్పు ముఖద్వారం తో నూరు శాతం వాస్తుతో నిర్మాణాన్ని చేపట్టారన్నారు ఈ కార్యక్రమంలో ఓడా చైర్మన్ షేక్ రియాజ్, జనసేన పార్టీ జిల్లా నాయకుడు కంది రవిశంకర్, ఎఎంసి చైర్మన్ , కార్పొరేటర్స్, ధరణి ఇన్ఫ్రా బిల్డర్స్ మారెళ్ళ వివేకానంద, మారెళ్ళ సుబ్బారావు, గూడా ప్రసాద్ రెడ్డి, భీమవరపు నాగిరెడ్డి, న్నారపు మస్తాన్ రావు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

వికలాంగులు మరియు గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి శుక్రవారం ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, గిరిజనుల సమస్యలను పరిష్కరించుటకు ప్రతినెలా చివరి శుక్రవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక పిజి ఆర్ఎస్‌లో వికలాంగులు, గిరిజనులు తమ సమస్యలపై అర్జీలను జిల్లా కలెక్టర్‌కు అందజేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చునని తెలిపారు.

సంక్షేమ పథకాలను వేగవంతం చేయాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్



వీక్షణ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ధాన్యం కొనుగోలు, సంక్షేమ వసతి గహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆర్‌టిజిఎస్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఎపి సచివాలయం నుంచి వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణపై సిఎస్ విజయానంద్ మాట్లాడుతూ బంగాళా ఖాతంలో అల్పపీడనం ఏర్పడిన నేపథ్యంలో రానున్న నాలుగు రోజుల్లో దక్షిణ ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, సత్యసాయి,కడప జిల్లాలు సహా మిగతా కోస్తా జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. దీనిపై రైతులను అప్రమత్తం చేసి ఎక్కడా ధాన్యం తడవకుండా చూడాలని చెప్పారు. ధాన్యం తడిసి పోయి మాయిశ్చర్ శాతం పెరిగిందనే ఫిర్యాదు రాకూడదని స్పష్టం చేశారు. ఈకారణంతో రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని బయట విక్రయించినట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత జాయింట్ కలెక్టర్ బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలన్ని వెంటనే ప్రారంభించాలన్నారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వేగవంతం చేయాలని చెప్పారు. కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ భావన, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కృష్ణయ్యను పదవి నుంచి తొలగించాలి

ఎపిఎన్‌జివి నేతల డిమాండ్



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

పశువైద్య విద్యలో డిగ్రీ లేకుండా వెటర్నరీ పదం వాడకూడదని పేర్కొన్న వెటర్నరీ కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పి వి. లక్ష్మయ్యను పదవి నుంచి తొలగించాలని ఎపి పశు సంవర్ధక శాఖ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. వెటర్నరీ పదం వాడకూడదని వెటర్నరీ కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్ వ్యాఖ్యానించటాన్ని వారు ఖండించారు. సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఎపిఎన్‌జివిఎఫ్ జిల్లా నాయకులు మాట్లాడుతూ గత 50 సంవత్సరాలు నుంచి పారా వెటర్నేరియన్‌గా క్షేత్రస్థాయిలో పిలవబడే వెటర్నరీ అసిస్టెంట్, లైవ్ స్టాక్ అసిస్టెంట్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ ఉన్నారన్నారు. వెటర్నరీ పదం వాడకూడదని, పారా వెటర్నరీ కౌన్సిల్‌లో ఆ పదం తొలగించాలని రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ తమపై అభియోగం మోపారన్నారు. కొన్ని దశాబ్దాలుగా తమ క్యాడర్‌కు సంబంధించిన అంశాలు పాలిటెక్నిక్ కళాశాలలు, ఒకేషనల్ కోర్సులు వంటి వెటర్నరీ పేరుతోనే రైతాంగానికి, ప్రజలు పిలవటానికి అనుకూలంగా ఉన్నాయన్నారు. దీంతో ప్రభుత్వానికి, వెటర్నరీ కౌన్సిల్‌కు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. అనంతరం జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావును ఎపిఎన్‌జివిఎఫ్ జిల్లా చైర్మన్ టివి.రమేష్ బాబు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ఎం.కోటేశ్వరరావు, కె.శంకరరావు, పి.శ్రీనివాసరావు, బి.ప్రభావతి, తులశమ్మ, సుశీల, శాంతకుమారి,పి.వెంకటేశ్వర్లు, ఎం.అంకమ్మ, ఆంజనేయులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

క్రీడల అభివృద్ధికి ప్రణాళికలు

స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ భరణి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లాను క్రీడా రంగం లో ముందుకు నడిపించడంలో భాగంగా క్రీడా మైదానాలకు అనువైన ప్రదేశాలను గుర్తించినట్లు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి తెలిపారు.జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా లో క్రీడల అబికృద్ధి పై కలెక్టర్‌తో చర్చించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ కళాశాల క్రీడా మైదానం, బాపట్ల మినీ స్టేడియం, చీరాల ఇండోర్ స్టేడియం, హైదర్ పేట క్రీడా స్థలం, వాటర్ స్పోర్ట్స్ కి అనువైన ప్రదేశాలు నాగరాజు కాలువ, పాండురంగాపురం బీచ్, సూర్యలంక బీచ్, చీరాల ఓడరేవును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఏ.శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసు సిబ్బంది

పోలీసు సిబ్బంది ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్: బాల్య వివాహాల నిర్మూలనకు భాగంగా ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్‌పి బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు మరియు సిబ్బంది జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలల భవిష్యత్తును దెబ్బతీసే సామాజిక సమస్య అని తెలిపారు. బాల్య వివాహం అనేది ఓ సామాజిక దురాచారం మరియు చట్ట ఉల్లంఘన అని పేర్కొన్నారు. బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం మరియు అభివద్ధిని అడ్డుకుంటుందని మరియు వారి కలలను సహకారం చేసుకోకుండా నిరోధిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమణారెడ్డి, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.